ప్రొఫెసర్ సమ్మయ్యపై ఫిర్యాదు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 19 : కేయూ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్యపై కేయూ పోలీస్ స్టేషన్‌లో బహుజన విద్యార్థి సంఘం కేయూ ఇన్‌చార్జి బొట్ల మనోహర్ ఫిర్యాదు చేశారు. కేయూ ఫార్మసీ విభాగంలో ఖాళీగా ఉన్న సీట్లను నింపాలని కోరగా, బయట విద్యార్థులకు పీహెచ్‌డీ సీటు ఇస్తే రూ.2లక్షల నుంచి రూ.3 లక్షలు వస్తాయని.. మీకు ఇస్తే ఏమి వస్తుందని, రూ. 3 లక్షలు తీసుకురా లేకపోతే ఇవ్వను.. ఎవరితో చెప్పుకుంటావు చెప్పుకో పో అని ప్రొఫెసర్ గాదె సమ్మయ్య వేధిస్తున్నాడని, భూతులు తిడుతున్నాడని ఫిర్యాదులో తెలిపారు.

'శ్రీధర్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలి'

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 19 : ఇటీవల కేయూ తెలుగు విభాగం ప్రొఫెసర్ జ్యోతిని దుర్భాష లాడుతూ భయపెట్టిన ఘటన మరువక ముందే శ్రీధర్ లోతుపై మరో ఫిర్యాదు నమోదైంది. యూనివర్సిటీ పీజీ మహిళా కళాశాలలో పార్ట్ టైం అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తున్న తుప్పం అన్నపూర్ణ కేయూ రిజిస్ట్రార్‌కు శ్రీధర్‌పై చేసిన ఫిర్యాదు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అన్నపూర్ణ క్యాంపస్ తెలుగు విభాగానికి బదిలీ చేయాలని డీన్ జ్యోతికి దరఖాస్తు చేసుకోగా బదిలీ ఖరారు చేసి రిజిస్ట్రార్‌కు పంపించారన్నారు. కాగా, వాటికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడకుండా ఒప్పంద అధ్యాపకుల అసోసియేషన్ నాయకుడిగా చెలామణి అవుతున్న ఎకనామిక్స్ విభాగానికి చెందిన శ్రీధర్ లోతు అడ్డుపడుతున్నారని, కేవలం దళిత మహిళ అన్న కారణంతో తనను మనోవేదనకు గురిచేస్తున్నారని అన్నపూర్ణ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్రీధర్‌తో తనకు ప్రాణభయం ఉందని చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఖిలావరంగల్, సెప్టెంబర్ 17: రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ భాషుమియా అన్నారు. గురువారం శివనగర్ తమ్మెర భవనంలో తెలంగాణ రాష్ట్ర ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రథమ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22, 23 తేదీల్లో యూనియన్ 3వ మహాసభ కొత్తగూడెంలో జరుగుతుందని, కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ కార్యదర్శి రమేశ్, కందిక చెన్నకేశవులు, దామెర కృష్ణ, జాన్‌పాల్, ఎండీ యాకూబ్, ఖాసీం, చిరంజీవి, కుమార్, కర్ణాకర్, రాజు, రంజిత్, మల్లేశ్ పాల్గొన్నారు.

'నర్సింగరావు కృషి ఎనలేనిది'

గిర్మాజీపేట, సెప్టెంబర్ 19 : వరంగల్ నగరంలో విద్యాభివృద్ధికి ఆకారపు నర్సింగరావు కృషి ఎనలేనిదని, రూ.కోట్లు విలువైన స్థలాన్ని కళాశాలకు దానం చేయడం ప్రశంసనీయమని కేయూ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం కొనియాడారు. గురువారం నర్సింగరావు 73వ వర్ధంతి కార్యక్రమాన్ని శ్రీవిశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ, పీజీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగరావు చిత్రపటానికి కళాశాల అధ్యక్షుడు ఆకారపు హరీశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సోనబోయిన సతీశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల పాలకవర్గ సభ్యులు డాక్టర్ బండారు ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు మేకల లింగమూర్తి, పరాశరం జయకృష్ణ, శ్రీధర్లకుమార్, శెట్టి దేవరాజు, యెగ్గడి సుస్మిత, సిబ్బంది రవీందర్, రాజు, లింగయ్య పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ

రాయపర్తి, సెప్టెంబర్ 19 : ఓవర్‌లోడ్, మితిమీరిన వేగంతో వస్తున్న లారీ అదుపు తప్పి గురువారం పొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికుల కథనం ప్రకారం.. బూడిద లోడ్‌తో వరంగల్ నుంచి ఖమ్మం వైపునకు వెళ్తున్న లారీ స్థానిక జగన్నాథపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో మైలారం శివారులో రహదారి ప్రక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ ధీరరాంపాల్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి సుమారు గంట పాటు తీవ్ర ఇబ్బంది పడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 సిబ్బంది చేరుకుని క్షతగాత్రుడిని దవాఖానకు తరలించారు.

పొలాల్లో లారీ..

కాజీపేటలో బైపాస్, మూడో లైన్ పరిశీలన

విద్యుత్ అధికారులను అడ్డుకుంటున్న దళితులు

కాజీపేట, సెప్టెంబర్ 19 : కాజీపేట– బల్లార్షా, కాజీపేట – విజయవాడ సెక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బైపాస్, మూడో లైన్ రైలు పట్టాలను గురువారం రైల్వే కమిషనర్ ఆఫ్ సేఫ్టీ అధికారుల బృందం ఆధ్వర్యంలో సీఆర్ఎస్ అధికారి మాధవి తనిఖీలు చేపట్టారు. న్యూఢిల్లీకి చెందిన రైల్వే సేఫ్టీ ఉన్నతాధికారుల బృందం సికింద్రాబాద్ నుంచి కాజీపేటకు ప్రత్యేక రైలులో వచ్చారు. మొదటి రోజు తనిఖీల్లో భాగంగా దాదాపు ఇరువైపులా 42 కిలోమీటర్ల పోడువునా కాజీపేట ఎఫ్ క్యాబిన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు ఏర్పాటు చేసిన బైపాస్ లైన్, కాజీపేట నుంచి హసన్‌పర్తి రోడ్డు రైల్వే స్టేషన్ వరకు ఏర్పాటు చేసిన మూడో లైన్ నిర్మాణం, సొరంగ మార్గాన్ని మోటర్ ట్రాలీలో వెళ్తూ పరిశీలించారు. సికింద్రాబాద్ హెడ్ క్వార్టర్ సేఫ్టీ అధికారులకు పలు సూచనలు చేశారు. రెండు రోజుల పాటు తనిఖీలు చేస్తామన్నారు. పనులను అక్టోబర్ రెండో వారం వరకు పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని, ట్రయల్ రన్ అనంతరం ఈ నూతన పట్టాలపై రైళ్లు నడుస్తాయిని తెలిపారు. డిప్యూటీ సీఆర్ఎస్ శ్రీనివాస్, ఏడీఆర్ఎం గోపాల్ నాయక్, రైల్వే సీఈఈ సీహెచ్ ఎస్‌రెడ్డి పాల్గొన్నారు.

మామపై బీరు సీసాతో దాడి చేసిన అల్లుడి అరెస్టు

ఖిలావరంగల్, సెప్టెంబర్ 19 : అస్తమానం ఇంటికి రావొద్దని మందలించిన మామపై అల్లుడు బీరు సీసాతో దాడి చేశాడు. విశ్వనాథకాలనీకి చెందిన యాకూబ్‌ను అతడి అల్లుడు అబ్బాస్ ఈ నెల 16న బీరు సీసాను పగులగొట్టి పొడిచాడు. వెంటనే కుటుంబసభ్యులు అతడిని ఎంజీఎం దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, అబ్బాస్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు మిల్స్‌కాలనీ సీఐ పీ మల్లయ్య తెలిపారు.

బల్దియా ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవ'

వరంగల్, సెప్టెంబర్ 19 : బల్దియా ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఐటీసీ వావ్ ఈ ఫౌండేషన్ సహకారంతో తేజస్వీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఎంహెచ్‌వో రాజేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి, వావ్ కో ఆర్డినేటర్ పవన్, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పద్మాక్షి గుండంలో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు

పద్మాక్షి గుండంలో చెత్తాచెదారం తొలగించాలి

హనుమకొండ, సెప్టెంబర్ 19 : హనుమకొండ పద్మాక్షి కాలనీలోని పద్మాక్షి గుండంలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తున్నదని కాలనీ వాసులు వాపోతున్నారు. గుండంలో చెత్తా చెదారంతో పాటు పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే దుర్వాసన, దోమలతో పిల్లలు, వృద్ధులు, కాలనీ వాసులు అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్నారని అంటున్నారు. ఇప్పటికే పలుమార్లు చెప్పినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్, అధికారులు వెంటనే స్పందించి గుండంలోని చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జాబ్ మేళాలో పాల్గొన్న ప్రిన్సిపాల్, కంపెనీల ప్రతినిధులు

సీకేఎం మెగా జాబ్ మేళాలో 213 మంది ఎంపిక

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 19 : వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు నిరుద్యోగుల నుండి విశేష స్పందన లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్‌రావు తెలిపారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ మేళాలో 573 మంది అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకోగా 213 మంది వివిధ సంస్థలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు రాఘవ, విక్రమ్, ప్రణయ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ ధర్మారెడ్డి, లైబ్రేరియన్ ఎస్ అనిల్‌కుమార్, అధ్యాపకులు సతీశ్‌కుమార్, హరిబాబు, స్రవంతి, సుమన్, నాగరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేఎంసీ అంతర్గత రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 19 : కాకతీయ మెడికల్ కళాశాల అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 17న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర వైద్య సేవల మౌళిక వసతుల కల్పన సంస్థ (టీఎస్ఎంఎస్‌డీసీ) సుమారు 3.45కోట్ల పనులకు శంకుస్థాపన చేయించింది. గురువారం గుత్తేదారులు పనులను ప్రారంభించారు. డిమాండ్లలో ఒకటైన అంతర్గత రోడ్డు పనులు ప్రారంభం కావడంతో వైద్య విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

యంత్రాలతో రోడ్డు పనులు చేస్తున్న కార్మికులు

దుంపిల్ల పరిధిలో ఎండుతున్న పంటలు

చివరి ఆయకట్టుకు అందని నీళ్లు

ఖానాపురం, సెప్టెంబర్19 : మండలంలోని తుంగబంధం కాల్వ పరిధి చివరి ఆయకట్టు పొలాలు నీరు అందక ఎండిపోతున్నాయి. పాకాల సరస్సు పూర్తిస్థాయిలో నిండి ప్రస్తుతం మత్తడి పోస్తున్నది. అయినా తుంగబంధం పరిధిలోని దుంపిల్ల పాయ, కొత్తూరు, రంగాపురం గ్రామాల రైతులు పొలాలకు నీరు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాల్వల పరిస్థితి అధ్వానంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. సుమారు మూడు వందల ఎకరాల వరి పంటలు ఎండి నెర్రెలు బారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి, దుంపిల్ల పాయ పరిధిలోని వరి పొలాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీరు అందక ఎండిన పంట

బేకరీలో అధికారుల తనిఖీ

వర్ధన్నపేట, సెప్టెంబర్ 19 : మండల కేంద్రంలోని బేకరీని గురువారం సాయంత్రం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేశారు. ఆ బేకరీలో ఖాదర్ అనే వ్యక్తి ఎగ్‌పఫ్ తినడంతో వాంతులై అస్వస్థతకు గురయ్యాడు. విషయం తెలియడంతో ఫుడ్ సేఫ్టీ అధికారి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అధికారులు షాపును పరిశీలించారు. బేకరీలోని కొన్ని ఆహార వస్తువుల ను పరీక్షల నిమిత్తం వరంగల్ ల్యాబ్‌కు తరలించినట్లు కృష్ణమూర్తి తెలిపారు.

పోతన ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురావాలి : మేయర్

వరంగల్, సెప్టెంబర్ 19 : పారిశుధ్య నిర్వహణలతో ఇబ్బందులను అధిగమించేందుకు వెంటనే పోతన ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. గురువారం కార్పొరేషన్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శానిటేషన్ వాహనాల మరమ్మత్తులను వెంట వెంటనే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ ప్రక్రియలో ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. వీధి దీపాల నిర్వహణ ప్రణాళికాబద్ధంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నయీంనగర్ బ్రిడ్జి సుందరీకరణలో భాగంగా వర్టికల్ గార్డెన్‌లో తగినంత లైటింగ్ ఉండేలా చూడాలన్నారు. సీఎంహెచ్‌వో రాజేశ్, ఇన్‌చార్జి ఎస్ఈ రాజయ్య, హెచ్‌వో రమేశ్, ఈఈ మహేందర్, శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్ పాల్గొన్నారు.

బల్దియా కార్యాలయంలో కమిషనర్ తనిఖీలు

వరంగల్, సెప్టెంబర్ 19 : బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తనిఖీలు చేశారు. గురువారం మధ్యాహ్నం ఆమె కార్యాలయంలోని అన్ని విభాగాల చాంబర్లను తనిఖీ చేసి పనితీరును పరిశీలించారు. అయా విభాగాల ఉద్యోగుల పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విభాగాల వారీగా ఉద్యోగుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన రెగ్యులర్ ఉద్యోగులకు షోకాజు నోటీసులు జారీ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒక రోజు వేతనం కోత పెట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బల్దియా కార్యదర్శి విజయలక్ష్మి, సూపరింటెండెంట్ రావుల ఆనంద్ పాల్గొన్నారు.

బల్దియా ప్రధాన కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ఎఫ్ఎస్ఎన్ఎల్‌ను అమ్మేసిన కేంద్రం

రూ.320 కోట్లకు జపాన్ సంస్థకు విక్రయం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: కేంద్ర సర్కార్ మరో ప్రభుత్వరంగ సంస్థను అమ్మేసింది. వాటాల విక్రయంలో భాగంగా ఫెర్రో స్క్రాప్ నిగం లిమిటెడ్(ఎఫ్ఎస్ఎన్ఎల్)ని జపాన్‌కు చెందిన కోనాయికీ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్‌కు రూ.320 కోట్లకు విక్రయించింది. స్టీల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్..ఎంఎస్‌టీసీ లిమిటెడ్‌కు చెందిన 100 శాతం సబ్సిడరీ సంస్థ. ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్ విక్రయానికి కేంద్రం గతంలోనే నిర్వహించిన బిడ్డింగ్ ప్రక్రియకు రెండు బిడ్డింగ్‌లు టెక్నికల్‌గా అర్హత సాధించాయి. వీటిలో జపాన్‌కు చెందిన కోనాయికీ అత్యధికంగా రూ.320 కోట్ల బిడ్డింగ్ దాఖలుకు కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, హెచ్‌డీ కుమార స్వామి నేతృత్వంలోని ప్రత్యేక కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రిజర్వు ధర రూ.262 కోట్లుకాగా, బిడ్డింగ్ రూ.320 కోట్లు దాఖలవడంతో దీనికి మొగ్గుచూపింది కేంద్రం. మరో బిడ్ ఇండిక్ జియో రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్(చందన్ స్టీల్ లిమిటెడ్‌కు చెందిన సబ్సిడరీ సంస్థ) దాఖలు చేసినట్లు తెలిపింది. టోక్యో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టైన కోనాయిక్ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్. సంస్థకు స్టీల్ రంగంలో 140 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది. 1979 నుంచి ఎఫ్ఎస్ఎన్ఎల్ స్టీల్ మిల్ సేవలను అందిస్తున్నది. పలు స్టీల్ ప్లాంట్ల నుంచి సేకరించిన స్క్రాప్ స్టీల్‌ను తిరిగి వినిమయంలో తెస్తున్నది సంస్థ.

హైదరాబాద్‌లో అల్ట్రావయలెట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన మోటార్‌సైకిళ్ల తయారీ సంస్థ అల్ట్రావయలెట్... తాజాగా రాష్ట్రంలోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లో తన తొలి షోరూంను గురువారం ప్రారంభించింది. దీంతో సంస్థకు ఇది ఐదో షోరూం కావడం విశేషం. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, కో–ఫౌండర్ నారాయణ్ సుబ్రమణియమ్ మాట్లాడుతూ.. వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో అడుగుపెట్టినట్లు, ఈ ఏడాది చివరినాటికి మొత్తం అవుటిలెట్ల సంఖ్యను పదికి పెంచుకోబోతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అధిక మైలేజీని కోరుకుంటున్నవారిని దృష్టిలో పెట్టుకొని తొలి మాడల్ ఎఫ్77ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 320 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నదన్నారు. దీంట్లో 7.1 కిలోవాట్లా బ్యాటరీ కలిగిన మాడల్ ధర రూ.2.99 లక్షలుగాను. 10.1 కిలోవాట్లా బ్యాటరీ మాడల్ రూ.3.99 లక్షలుగా నిర్ణయించింది. మరోవైపు, శుక్రవారం సంస్థ గంటకు 265 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఎఫ్99ని స్పోర్ట్స్ బైకును ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. వచ్చే 2–3మూడేండ్లలో మరో 3–4 మాడళ్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించిన ఆయన... ఈ బైకులపై ఎనిమిదేండ్లు లేదా 8 లక్షల కిలోమీటర్ల వ్యారెంటీ కల్పిస్తున్నది.

సేల్స్‌ఫోర్స్ విస్తరణ

శాన్ ఫ్రాన్సిస్కో, సెప్టెంబర్ 19: కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ సేవల సంస్థ సేల్స్‌ఫోర్స్..భారత్‌లో తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. హైదరాబాద్‌తోపాటు బెంగళూరులలో ఉన్న సెంటర్లను ఆధునీకరించడానికి మరిన్ని పెట్టుబడులు పెట్టబోతున్నట్లు కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి బ్రియాన్ మిల్హమ్ తెలిపారు. మరోవైపు, కంపెనీ దేశీయ హెడ్ అరుంధతీ భట్టాచార్య మాట్లాడుతూ..భారత్‌లో ఉద్యోగుల సంఖ్యను గడిచిన రెండేండ్లలో రెండింతలు పెంచినట్లు, ప్రస్తుతం 13 వేల మంది విధులు నిర్వహిస్తున్నారని, మరింత మందిని తీసుకునే అవకాశాలున్నట్లు చెప్పారు.

హెరిటేజ్ ఐస్‌క్రీం ప్లాంట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్..తాజాగా తెలంగాణలో ఐస్‌క్రీం ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. షామీర్‌పేట్‌లో రూ.204 కోట్ల పెట్టుబడితో నెలకొల్పబోతున్నట్లు తెలిపింది. ఈ ప్లాంట్ ఏర్పాటునకు సంబంధించి కంపెనీ బోర్డు డైరెక్టర్లు సమావేశమై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో ఐస్‌క్రీంకు పెరుగుతున్న గిరాకీని దృష్టిలో పెట్టుకొని ఈ యూనిట్‌ను నెలకొల్పాలని నిర్ణయించినట్లు, వచ్చే ఏడాది నవంబర్ నాటికి ఈ యూనిట్ అందుబాటులోకి రానున్నట్లు కంపెనీ వర్గాల వెల్లడించాయి.

వాణిజ్య

టప్పర్‌వేర్ దివాలా

ఆర్థిక సంక్షోభంలో ప్లాస్టిక్ కిచెన్‌వేర్ దిగ్గజం • అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు
తగ్గిన గిరాకీ, పెరిగిన పోటీతో కుదేలు • రూ.10వేల కోట్ల రుణ భారం

న్యూయార్క్, సెప్టెంబర్ 19: ప్రముఖ ప్లాస్టిక్ కిచెన్‌వేర్ బ్రాండ్ టప్పర్‌వేర్ దివాలా తీసింది. అమెరికా బ్యాంకర్‌ప్సీ కోర్టులో చాప్టర్ 11 బ్యాంకర్‌ప్సీ రక్షణను కోరుతూ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఆహార పదార్థాల నిల్వలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఈ సంస్థ.. ప్రస్తుత మార్కెట్‌లో నెలకొన్న పోటీని తట్టుకోలేక చతికిలపడింది. పర్యావరణ పరిరక్షణపై పెరిగిన అవగాహన, ప్లాస్టిక్ వినియోగంపై మారుతున్న కస్టమర్ల అభిప్రాయాలు సైతం టప్పర్‌వేర్ అమ్మకాలకు గండి కొట్టాయి.

80 ఏండ్ల కిందట..

అమెరికాలోని ఫ్లోరిడాలోగల ఓర్లాండో ప్రధాన కేంద్రంగా 1942లో టప్పర్‌వేర్ బ్రాండ్‌ను ఎర్ల్ టప్పర్ స్థాపించారు. 1946లో మార్కెట్‌కు వీటి ఉత్పత్తులు పరిచయమయ్యాయి. అప్పట్నుంచి టప్పర్‌వేర్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతూ వచ్చింది. కానీ మార్కెట్‌లో పెరిగిన పోటీతో అమ్మకాలు తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. క్లీనెక్స్, టెఫ్లాన్, ఇతర బ్రాండ్ల దూకుడు ముందు టప్పర్‌వేర్ నిలదొక్కుకోలేకపోయింది. ఇక డైరెక్ట్ సేల్స్ నుంచి వినియోగదారులు దూరం జరుగడం కూడా సంస్థ వ్యాపారాన్ని దెబ్బతీసిందని దివాలా పిటిషన్‌లో టప్పర్‌వేర్ పేర్కొన్నది.

పీకల్లోతు అప్పులు

దివాలా పిటిషన్ ప్రకారం టప్పర్‌వేర్‌పై రూ.10,000 కోట్ల (1.2 బిలియన్ డాలర్లు) రుణ భారం ఉన్నది. రుణదాతలతో చేసుకున్న ఒప్పందాలనూ ఇది మీరినట్టు తెలుస్తున్నది. అయితే సుమారు రూ.5,700 కోట్ల (679.5 మిలియన్ డాలర్ల) ఆస్తులు కూడా ఉన్నట్టు కంపెనీ చెప్తున్నది. ఇక ప్రస్తుతం సంస్థ ఉద్యోగుల సంఖ్య 5,500. భారత్‌తోపాటు 41 దేశాల్లో వీరంతా పనిచేస్తున్నారు. 4.65 లక్షల కన్సల్టెంట్లూ ఉన్నారు. ఫ్రీలాన్స్ బేసిస్‌లో దాదాపు 70 దేశాల్లో టప్పర్‌వేర్ ఉత్పత్తులను అమ్ముతున్నారు.

భారత్‌లో యథాతథంగానే..

అమెరికా దివాలా కోర్టులో పిటిషన్ దాఖలు చేసినప్పటికీ.. భారత్‌లో టప్పర్‌వేర్ అమ్మకాలు యథాతథంగానే సాగుతాయని సంబంధిత వర్గాల నుంచి అందుతున్న సమాచారం. దేశీయంగానే టప్పర్‌వేర్ ఉత్పత్తుల తయారీ జరుగుతున్నది కాబట్టి.. అంతర్జాతీయ మార్కెట్‌లో తలెత్తిన ఇబ్బందులు ఇక్కడ ప్రభావం చూపబోవని వారంటున్నారు. అంతేగాక మునుపటిలాగే విస్తరణ ఉంటుందని, కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగా నాణ్యమైన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తెస్తామని చెప్తున్నారు. ఇప్పటికే గ్లాస్, స్టీల్ ఉత్పత్తులనూ టప్పర్‌వేర్ బ్రాండ్ అమ్ముతున్న విషయం తెలిసిందే.

'దివాలా ప్రక్రియ అంటే సంస్థ మనుగడకు కావాల్సిన వెసులుబాట్లను కల్పించడమే. ఈ కంపెనీ ఎక్కడికీ పోదు. ఎప్పట్లాగే ఇకపైనా మా నాణ్యమైన ఉత్పత్తులు మార్కెట్‌లో లభిస్తాయి'

-లారీ అన్ గోల్డ్‌మన్, టప్పర్‌వేర్ అధ్యక్షుడు, సీఈవో

దేశానికే ఆదర్శంగా స్కిల్ వర్సిటీ

- **కంపెనీలు, పారిశ్రామికవేత్తలు భాగస్వాములవ్వాలి: సీఎం రేవంత్**
- **దసరా తర్వాత కోర్సులు ప్రారంభం**

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీలు ఈ యూనివర్సిటీలో భాగస్వాములవ్వాలని, యువతకు నైపుణ్యాలను పెంచి.. వారికి ఉపాధి కల్పించేందుకు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ బోర్డుతోపాటు రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో గురువారం సచివాలయంలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున 150 ఎకరాల స్థలంతోపాటు రూ.100 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు యూనివర్సిటీ నిర్వహణ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటుకు, భవనాల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. బోర్డు చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా యూనివర్సిటీకి బ్రాండ్ ఇమేజీని తీసుకువస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఇకపై తమ ప్రభుత్వం యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి సారిస్తుందన్నారు. దాదాపు 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పి.. 2028 ఒలింపిక్స్‌లో దేశానికి గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడాకారులకు శిక్షణను అందిస్తామన్నారు. ఇందుకోసం రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ.. ప్రపంచానికి నైపుణ్యమున్న యువతను అందించే గమ్యస్థానంగా తెలంగాణ నిలబడుతుందనడంలో సందేహం లేదన్నారు. కాగా, దసరా తర్వాత కోర్సులను ప్రారంభించనున్నట్టు బోర్డు సూచన